‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

కామారెడ్డి ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

ఎమ్మెల్యే రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాచారెడ్డి, జనవరి 31 : మండల పరిషత్ కార్యాలయాన్ని పాల్వంచ మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా ప్రారంభం కాబోతున్న పాల్వంచ మండల పరిషత్ కార్యాలయాన్ని ఏల్పుగొండ గ్రామంలో ఉన్న సొసైటీ భవనంలో ప్రారంభించడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పాల్వంచలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తోట బాల్ రాజు, నారాగౌడ్, కూచని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి 15 రోజుల జైలుశిక్ష

బాన్సువాడ, జనవరి 31: బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన కేసులో ఓ వ్యక్తికి 15 రోజుల జైలు శిక్షతోపాటు రూ.వంద జరిమానా విధించినట్లు పట్టణ సీఐ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ రైతు సమితి కార్యాలయం సమీపంలో 2023 నవంబర్ 19న దామరంచకు చెందిన ఎర్రోళ్ల హన్మవ్వ పట్టణంలోని ఆమె బంధువులైన బొడ్డు సంగవ్వ ఇంటికి వెళ్తున్నది. బోధన్‌కు చెందిన నాగారం సాయిలు అనే వ్యక్తి వృద్ధురాలి మెడలోంచి బలవంతంగా రూ.40 వేల విలువైన బంగారు గుండ్లను లాక్కొని పారిపోతుండగా బాధితురాలు కేకలు వేసింది. బాధితురాలి వెంట ఉన్న వ్యక్తితోపాటు చుట్టు పక్కల వారు వెంబడించి ఆ వ్యక్తిని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి వచ్చి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 2023లో కేసు నమోదైంది. బాన్సువాడ కోర్డు న్యాయమూర్తి టీఎస్పీ భార్గవి నిందితుడికి 15 రోజులపాటు జైలు శిక్షతోపాటు వంద రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

కామారెడ్డి, జనవరి 31 : జిల్లావ్యాప్తంగా రహదారి భద్రతా మాసోత్సవాల అవగాహన సదస్సులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి మొదలుకొని హెవీ వెహికిల్ డ్రైవర్స్ వరకు, ఆర్టీసీ డ్రైవర్స్ మొదలుకొని ఆటో డ్రైవర్స్ వరకు అన్ని వర్గాల వారిని కలుపుకొని అందరికీ చైతన్యం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డిబేట్, ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. అత్యుత్తమ ప్రదర్శన చేసిన పోలీసు కళాబృంద సభ్యులకు, రవాణా శాఖ సిబ్బందిని ప్రశంసాపత్రాలు, హెల్మెట్ల ద్వారా సత్కరించారు. కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి

బీబీపేట్, జనవరి 31 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. బీబీపేటలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, పోలీసులు, ఎంవీఐ అధికారులతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, ఎంవీఐ అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఎంవీఐ అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

తండ్రి అంత్యక్రియలను నిర్వహిస్తున్న కూతురు అఖిల

మాచారెడ్డి, జనవరి 31 : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఇందూరి రామాగౌడ్ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు కొడుకులు లేకపోవడంతో తన చిన్న కూతురు అఖిల తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించింది. కూతురు తలకొరివి పెట్టడంతో స్థానికులు కంటతడి పెట్టారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

లింగంపేటలో మాట్లాడుతున్న డీఆర్డీవో సురేందర్

రాజంపేట్/ బీబీపేట్/ లింగంపేట/ నాగిరెడ్డిపేట/ బిచ్కుంద, జనవరి 31 : గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్లకు లీకేజీలు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో సురేందర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా విషయంలో మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హరీ, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ విష్ణు, ఇంట్రా ఏఈ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణ కోసం శనివారం నుంచి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణి రత్నం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వాటర్‌మెన్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎంపిక చేసిన బృందాలు ఫిబ్రవరి పదో తేదీ వరకు గ్రామాల్లో తిరుగుతూ నీటి సమస్యను గుర్తించి, నివేదిక తయారు చేయాలని సూచించారు. నివేదికను కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తామని, సర్వే పక బృందంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జుక్కల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి భాస్కరన్ పాల్గొని పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి, గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము, మిషన్ భగీరథ ఏఈ అర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రఘురాం శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ, ఎంపీడీవో రఘురాం, మిషన్ భగీరథ ఏఈ రజిత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. బీబీపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగిరథ ఏఈలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 11నెలలుగా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా, బాన్సువాడ ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిరాజుకు బాన్సువాడ కమిషనర్‌గా ఫుల్ చార్జి అప్పగించారు. దీంతో నిజామాబాద్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మహేశ్‌కుమార్ ఉద్యోగోన్నతిపై ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు.

ఇద్దరి బైండోవర్

గాంధారి, జనవరి 31: నాటు సారా తయారు చేసి, విక్రయించిన కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని తహసీల్దార్ సతీశ్‌రెడ్డి ఎదుట ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం బైండోవర్ చేశారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండివేట్ తండాకు చెందిన రమావత్ ధోలి, విస్లావత్ సోమ్లా గతంలో నాటు సారా తయారు చేసి, విక్రయించిన కేసులో నిందితులుగా ఉన్నారు. వీరు భవిష్యత్తులో తిరిగి తప్పు చేయకుండా ఉండడానికి ముందస్తు చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ చేసిన వ్యక్తులు తిరిగి తప్పు చేస్తే రెండు లక్షల రూపాయల జరిమానాతోపాటు, ఏడాదిపాటు జైలు శిక్ష విధించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. కార్యక్రమంలో రజిత, స్రవంతి, పెంటయ్య, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తండాలో అధికారుల పర్యటన

లింగంపేట, జనవరి 31: తండాలో నీటి ఎద్దడి నివారించాలని ఎల్లమ్మ తండా గిరిజనులు అధికారులను కోరారు. డీఆర్డీవో సురేందర్, ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హరీ తదితరులు శుక్రవారం తండాలో పర్యటించారు. తండా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాలో నీటి సమస్య ఉన్నదని, ఎండాకాలం వస్తున్నందున సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు.

ఐదు నెలల వేతనాలు చెల్లించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డులకు ఐదు నెలల జీతం వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథ్ కలిసి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డులకు శ్రీ గణేశ్ ఏజెన్సీ నుంచి గత ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి, సిబ్బందికివేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని అమలు చేయాలన్నారు.

సౌత్ క్యాంపస్‌లో పీజీ పరీక్షలు ప్రారంభం

భిక్కనూరు, జనవరి 31: సౌత్ క్యాంపస్‌లో పీజీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టీయూ దక్షిణ ప్రాంగణంలో పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించే గదులను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. ఉదయం మొదటి సెమిస్టర్ పరీక్షకు మొత్తం 169 మంది విద్యార్థులకుగాను 162 మంది హాజరవగా.. ఏడుగురు విద్యార్థులు గైర్హాజయ్యారని తెలిపారు. మధ్యాహ్నం మూడో సెమిస్టర్ పరీక్షకు 159 మంది విద్యార్థులకుగాను 155 మంది హాజరయ్యారని నలుగురు గైర్హాజరయ్యారని తెలిపారు.

రైతులకు సాగుచట్టాలపై అవగాహన ఉండాలి

భిక్కనూరు, జనవరి 31: ప్రతి రైతుకు సాగు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి అన్నారు. భిక్కనూరు రైతు వేదికలో రైతులతో న్యాయ చైతన్య సదస్సును శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు న్యాయంగా రైతులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు వేదికలోని అగ్రి లీగల్ క్లినిక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి శోభ, ఏఈవో ఆనంద్, పీఎల్వీలు నరేశ్, సంతోష్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి

అవగాహన కల్పిస్తున్న నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్

నాగిరెడ్డిపేట/ గాంధారి, జనవరి 31: నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మాకూర్ గ్రామ దళితవాడలో శుక్రవారం సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామాల్లో భూములు, స్థలాలకు సంబంధించి సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మహ్మద్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు, ఎస్సీ వసతి గృహ సిబ్బంది శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. సర్వాపూర్ గ్రామంలో గాంధారి నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్ సివిల్ రైట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత